# ఎల్లలు దాటిన అభిమానం



'దేవర' చిత్రం జపాన్‌లో నేడు ప్రేక్షకుల ముందుకొస్తున్నది. ఈ సినిమా ప్రచార కార్యక్రమాల కోసం కొద్దిరోజుల క్రితం జపాన్ వెళ్లిన చిత్ర కథానాయకుడు ఎన్టీఆర్ అక్కడ బిజీబిజీగా గడుపుతున్నారు. జపాన్‌లోని వివిధ నగరాల్లో నిర్వహిస్తున్న ప్రమోషనల్ ఈవెంట్స్‌లో ఆయన పాల్గొంటున్నారు. అభిమానులతో సెల్ఫీలు దిగుతూ, వారికి ఆటోగ్రాఫ్‌లు ఇస్తున్న ఎన్టీఆర్ ఫొటోలు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ సందర్భంగా జపాన్‌లోని ఓ అభిమాని చెప్పిన మాటలు తన హృదయాన్ని కదిలించాయని ఎన్టీఆర్ తన సోషల్‌మీడియా ఖాతాల్లో పోస్ట్ చేశారు. ఆర్ఆర్ఆర్ సినిమా చూశాక తాను తెలుగు నేర్చుకుంటున్నానని ఓ అభిమాని తనతో చెప్పడం గొప్ప సంతోషాన్నిచ్చిందని ఎన్టీఆర్ పేర్కొన్నారు. 'సినిమా భిన్న సంస్కృతుల మధ్య వారధిగా నిలుస్తూ ఓ అభిమానిని తెలుగు నేర్చుకునేలా స్ఫూర్తిని కలిగించడం చాలా గొప్ప విషయం. సమకాలీన భారతీయ సినిమా విశ్వవ్యాప్తం కావడం అమితానందాన్ని కలిగిస్తున్నది' అని ఎన్టీఆర్ తన పోస్ట్‌లో వెల్లడించారు. ఇటీవలే ఎన్టీఆర్ హిందీ 'వార్-2' షూటింగ్‌ను పూర్తి చేశారు. ప్రస్తుతం ప్రశాంత్‌నీల్ డైరెక్షన్‌లో రూపొందుతున్న సినిమా కోసం సిద్ధమవుతున్నారు.



# మ్యాడ్ స్క్వేర్ కాదు..మ్యాడ్‌మాక్స్!

'ఈ సినిమా ట్రైలర్ చాలా బాగుంది. ఇది మ్యాడ్ స్క్వేర్ కాదు..మ్యాడ్‌మాక్స్. కామెడీ మనలోని ఒత్తిడిని దూరం చేస్తుంది. ఇలాంటి సినిమాలు రావడం ఆరోగ్యానికి చాలా మంచిది' అన్నారు అక్కినేని నాగచైతన్య. బుధవారం జరిగిన 'మ్యాడ్ స్క్వేర్' చిత్ర ప్రీరిలీజ్ ఈవెంట్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నార్నె నితిన్, సంగీత్ శోభన్, రామ్ నితిన్, విష్ణు ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి కల్యాణ్‌శంకర్ దర్శకుడు. హారిక సూర్యదేవర, సాయిసౌజన్య నిర్మించారు. నేడు ప్రేక్షకుల ముందుకొస్తున్నది. ఈ సందర్భంగా నాగచైతన్య మాట్లాడుతూ.. ఇలాంటి సినిమాలు స్నేహబంధాన్ని బలంగా మారుస్తాయని, కొత్త ఫ్రెండ్స్‌ని పరిచయం చేస్తాయని, ఇందులో నటించిన ముగ్గురు హీరోలు ఇంట్లో కుటుంబ సభ్యుల్లా మారిపోయారని చెప్పారు. నిర్మాత హారిక సూర్యదేవర మాట్లాడుతూ 'ఒక కామెడీ సినిమా తీసి నవ్వించడమే చాలా కష్టం. అలాంటిది మా దర్శకుడు కల్యాణ్‌శంకర్ ఫ్రాంఛైజీ రన్ చేస్తున్నారు. భీమ్స్ సంగీతం ఈ సినిమాపై మంచి హైప్‌ని క్రియేట్ చేసింది' అని చెప్పారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు మారుతి, వెంకీ అట్లూరితో పాటు చిత్రబృందం మొత్తం పాల్గొన్నారు.

# ప్రత్యర్థుల్ని ఆటాడే పెద్ది



అగ్రహీరో రామ్‌చరణ్ కథానాయకుడిగా బుచ్చిబాబు సానా దర్శకత్వంలో మైత్రీమూవీ మేకర్స్, వృద్ధి సినిమాస్, సుకుమార్ రైటింగ్స్ కలిసి నిర్మిస్తున్న పానిండియా ప్రాజెక్ట్‌కు 'పెద్ది' అనే పేరు ఖరారు చేశారు. గురువారం రామ్‌చరణ్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా ఫస్ట్‌లుక్స్‌ని మేకర్స్ విడుదల చేశారు. మ్యాసీ హెయిర్ స్టైల్‌తో.. రగ్గడ్ గడ్డంతో, ముక్కుకు రింగుతో సిగార్ వెలిగిస్తూ.. ఫెరోషియస్‌గా ఓ లుక్‌లో రామ్‌చరణ్ కనిపిస్తుంటే.. ఫ్లడ్ లైట్లతో ప్రకాశిస్తున్న స్టేడియం బ్యాక్‌డ్రాప్‌లో క్రికెట్ బ్యాట్ పట్టుకుని సీరియస్‌గా చూస్తూ.. మరో లుక్‌లో రామ్‌చరణ్ దర్శనిస్తున్నారు. రామ్‌చరణ్ పాత్రలోని పవర్‌ని ఎస్టాబ్లిష్ చేసేలా 'పెద్ది' అనే టైటిల్‌ని దర్శకుడు బుచ్చిబాబు సానా నిర్ణయించారని, భారీ బడ్జెట్‌తో అత్యాధునిక సాంకేతికత, అత్యద్భుతమైన విజువల్స్‌తో, ప్రపంచస్థాయి నిర్మాణ విలువలతో ఓ ఎపిక్‌గా ఈ సినిమా రూపొందుతున్నదని, ప్రేక్షకులకు మరపురాని అనుభవం ఇచ్చే సినిమా ఇదని నిర్మాతలు తెలిపారు. జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో కన్నడ అగ్రహీరో శివరాజ్ కుమార్ కీలక పాత్ర పోషిస్తున్నారు. జగపతి బాబు, దివ్యేందు శర్మ ముఖ్య పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: రత్నవేలు, సంగీతం: ఏ.ఆర్.రెహమాన్, నిర్మాత: వెంకట సతీష్ కిలారు.

# నాని డైరెక్టర్‌తో విజయ్ సినిమా?



అగ్రహీరో విజయ్ దేవరకొండ వేగం పెంచారు. వరుసపెట్టి సినిమాలకు సైన్ చేస్తున్నాయన. ప్రస్తుతం గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో ఆయన 'కింగ్‌డమ్' సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. సితార ఎంటర్‌టైన్మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ ఈ సినిమా నిర్మిస్తున్నారు. ఆ తర్వాత రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వంలో ఓ సినిమా. 'రాజావారు రాణీవారు' ఫేం రవికిరణ్ కోలా దర్శకత్వంలో ఓ సినిమా విజయ్ చేయాల్సివుంది. అయితే.. ఈ ఇద్దరితోపాటు మరో దర్శకుడి కథను కూడా విజయ్ దేవరకొండ ఓకే చేశారని ఫిల్మ్ వర్గాల్లో టాక్. ఆ డైరెక్టర్ ఎవరో కాదు.. ఇంద్రగంటి మోహనకృష్ణ. గ్రహణం, అష్టాచెమ్మా, జెంటిల్‌మ్యాన్, సమ్మోహనం.. దర్శకునిగా ఇంద్రగంటి పొటెన్షియాలిటీ చెప్పుకోడానికి ఈ నాలుగు సినిమాలు చాలు. రీసెంట్‌గా విజయ్ దేవరకొండకు ఆయన ఓ కథ వినిపించారట. ఆ కథ విజయ్‌కి కూడా బాగా నచ్చిందని తెలుస్తున్నది. ప్రస్తుతం బౌండ్ స్క్రిప్ట్‌ని రెడీ చేసే పనిలో ఉన్నదట ఇంద్రగంటి టీమ్. 'కింగ్‌డమ్' సినిమా తర్వాత రాహుల్ సంకృత్యాన్ సినిమా ఉంటుందని తెలుస్తున్నది. ఆ సినిమా తర్వాత రవికిరణ్ కోలా, ఇంద్రగంటి మోహనకృష్ణల్లో ఎవరు ముందు బౌండ్ స్క్రిప్ట్‌తో వస్తే వారి సినిమా విజయ్ చేస్తారని సమాచారం. మరి వారిద్దరిలో విజయ్‌ని డైరెక్ట్ చేసే అవకాశం ముందు ఎవర్ని వరిస్తుందో చూడాలి.

# నా డ్రీమ్ డైరెక్టర్ ఆయనే..



భారతీయ సినిమాలో డ్రీమ్ డైరెక్టర్లనగానే ప్రముఖంగా వినిపించే పేర్లు.. మణిరత్నం, రాజమౌళి, సంజయ్‌లీలా భన్సాలీ, శంకర్. ఈ నలుగురి సినిమాల్లో నటించాలని హీరోహీరోయిన్లు పలవరిస్తుంటారు. ఇటీవల కమల్ ముద్దుల తనయ శ్రుతీహాసన్ కూడా తన కలల దర్శకుడి పేరు వెల్లడించారు. అయితే.. పైన పేర్కొన్న లిస్ట్‌లో ఆ దర్శకుడు లేడు. ఇంతకీ ఆ డైరెక్టర్ ఎవరనుకుంటున్నారు? అతనే లోకేష్ కనకరాజ్. ఖైదీ, విక్రమ్, లియో సినిమాలతో బాక్సాఫీస్ దుమ్ము దులిపిన లోకేష్ కనకరాజ్ తన డ్రీమ్ డైరెక్టర్ అని శ్రుతీ హాసన్ చెప్పారు. ఆయన దర్శకత్వంలో నటించాలనేది తన కల అని. ఆ కల 'కూలీ' సినిమాతో నెరవేరినందుకు సంతోషంగా ఉందని శ్రుతీహాసన్ ఆనందం వ్యక్తం చేశారు. ' 'విక్రమ్' సినిమా చూసినప్పుడు నేను పొందిన ఆనందాన్ని మాటల్లో చెప్పలేను. అప్పాని నేను ఎలా చూడాలనుకున్నానో.. ఆ సినిమాలో అలా కనిపించారు. అప్పాను హ్యాండిల్ చేయడం ఇప్పటి దర్శకులకు కష్టమైపోతున్నదని బాధ పడేదాన్ని. 'విక్రమ్'తో ఆ బాధ తీరిపోయింది. రాబోతున్న 'కూలీ'లో రజనీ అంకుల్ కొత్త అవతారాన్ని చూస్తారు. ఇందులో నా పాత్ర గురించి నేను మాట్లాడను.. అది సస్పెన్స్..' అంటూ చెప్పుకొచ్చింది శ్రుతి హాసన్. నిజానికి 'కూలీ' కంటే ముందు లోకేష్ దర్శకత్వంలో ఓ రొమాంటిక్ యాడ్ షూట్‌లో నటించారు శ్రుతిహాసన్. ఆ యాడ్ షూట్ తర్వాత వారిద్దరూ రిలేషన్‌లో ఉన్నట్టు వార్తలు కూడా వచ్చాయి.

# వారిని అపార్థం చేసుకున్నా!



అమీర్‌ఖాన్ నటించిన 'దంగల్' చిత్రం అత్యధిక వసూళ్లు సాధించిన భారతీయ సినిమా చిత్రంగా రికార్డు సృష్టించింది. తాజా ఇంటర్వ్యూలో ఈ సినిమా తాలూకు ఆసక్తికరమైన విషయాన్ని వెల్లడించారు అమీర్‌ఖాన్. ఈ సినిమా విషయంలో సల్మాన్‌ఖాన్, షారుఖ్‌ఖాన్‌లను అపార్థం చేసుకున్నానని తెలిపారు. 'నేను సినిమాల విషయంలో బాక్సాఫీస్ కలెక్షన్స్‌ను పరిగణనలోకి తీసుకొని, ట్రెండ్‌కు అనుగుణంగా నా మనసుకు నచ్చిన కథల్ని ఎంచుకుంటాను.'లగాన్' 'దంగల్' లాంటి సినిమాలను అలానే ఎంపిక చేసుకున్నా. అయితే 'దంగల్' స్క్రిప్ట్ నా దగ్గరకు వచ్చినప్పుడు షారుఖ్, సల్మాన్‌లు నా కెరీర్‌ను దెబ్బతీసేందుకు ఇలాంటి స్క్రిప్ట్‌ను పంపించారేమో అని అనుమానపడ్డాను. అందుకే స్క్రిప్ట్ ఓకే చేయడానికి చాలా టైం తీసుకున్నా. దర్శకుడు నితీష్ తివారీ మాత్రం నాతోనే సినిమా చేస్తానని పట్టుబట్టారు. ఆ తర్వాత 'దంగల్' స్క్రిప్ట్‌ను క్షుణ్ణంగా పరిశీలించా. అప్పుడు గొప్ప సబ్జెక్ట్ అని అర్థమైంది. ఈ సినిమాలో తొలుత తండ్రి పాత్రలో నటించేందుకు సందేహించాను. ఆయినా సరే రిస్క్ తీసుకొని సినిమా చేశా. అప్పటి నుంచి ప్రయోగాలు చేస్తూనే ఉన్నా' అని చెప్పుకొచ్చారు అమీర్‌ఖాన్. కుస్తీ క్రీడాకారుడు మహావీర్ ఫోగట్, అతడి కుమార్తె జీవితం ఆధారంగా 'దంగల్' సినిమాను రూపొందించారు. ఇప్పటి వరకు భారతీయ సినిమాలో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా 'దంగల్' రికార్డుల్లో నిలిచింది.



# సల్మాన్ చేతికి రామ్‌జన్మభూమి గడియారం

అగ్ర నటుడు సల్మాన్‌ఖాన్ ధరించిన రామ్‌జన్మభూమి వాచ్ సోషల్‌మీడియాలో అందరి దృష్టిని ఆకర్షిస్తున్నది. లిమిటెడ్ ఎడిషన్‌గా లగ్జరీ బ్రాండ్ జాకబ్ అండ్ కో కంపెనీ ఈ చేతి గడియారాన్ని తయారు చేసింది. ఈ వాచ్‌ను ధరించిన ఫొటోలను గురువారం సల్మాన్‌ఖాన్ తన సోషల్‌మీడియా ఖాతాల్లో పోస్ట్ చేశారు. దీని ఖరీదు 61 లక్షలని కంపెనీ ప్రకటించింది. అయోధ్య రామమందిరం, రామలక్ష్మణులు, హనుమాన్‌తో పాటు హిందూ దేవతామూర్తుల చిహ్నాలను పొందుపరుస్తూ ఈ గడియారాన్ని తయారుచేశారు. సల్మాన్‌ఖాన్ కథానాయకుడిగా మురుగదాస్ దర్శకత్వంలో రూపొందిన యాక్షన్ ఎంటర్‌టైనర్ 'సికందర్' ఈ నెల 30న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో సల్మాన్‌ఖాన్ ఈ వాచ్ ఫొటోను సోషల్‌మీడియాలో పోస్ట్ చేశారు. ఈ ఫొటోపై సల్మాన్ అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆయన సిసలైన లౌకికవాది అంటూ ప్రశంసిస్తున్నారు.

# అది కోర్టు ధిక్కారం



ఏ సమయంలో ఎందరు ఇంటికి వచ్చినా కాదనకుండా, లేదనకుండా స్వయంగా తనే వండి, వార్చి అన్నార్తుల ఆకలి తీర్చిన అపర అన్నపూర్ణ 'డొక్కా సీతమ్మ'. ఈమె కథ వెండితెరకెక్కించే ప్రయత్నంలో వివాదం నెలకొన్నది. ఈ విషయం గురించి హైదరాబాద్‌లో దర్శక, రచయిత రామకృష్ణ, వి.ప్రభాకర్‌గౌడ్ మీడియాతో మాట్లాడుతూ 'ఎంతోకాలంగా ఎన్నో వ్యయప్రయాసలకోర్చి, చరిత్రను పరిశోధించి ఈ స్క్రిప్ట్ తయారు చేశాం. హైదరాబాద్, సినీరచయితల సంఘంలో రిజిస్టర్ కూడా చేయించాం. అయితే.. ఇది చరిత్ర అనే సాకుతో, మా స్క్రిప్ట్‌నే కాపీ కొడుతూ వేరొకరు ఈ సినిమా తీయడానికి పూనుకోవడంతో వివాదం కోర్టుకు చేరింది. కాపీరైట్ యాక్ట్ మాకు ఉన్నప్పటికీ.. విషయం కోర్టు పరిధిలో ఉన్నందున, మేం నిర్మాణం జోలికి వెళ్లకుండా సైలెంట్‌గా ఉన్నాం. అయితే.. అవతల వాళ్లు మాత్రం సినిమా తీసేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు మా దృష్టికి వచ్చింది. నిజంగా అలాంటిదే జరిగితే.. అది కోర్టు ధిక్కారం అవుతుంది. కోర్టులో విషయం తేలే వరకూ యధాతథస్థితిని కొనసాగించాలి. లేదంటే కోర్టు ద్వారానే సమాధానం చెబుతాం.' అని హెచ్చరించారు.

# మేఘాలు చెప్పిన ప్రేమకథ

మత్తువదలరా, వికటకవి చిత్రాలతో ఆకట్టుకున్న నరేష్ అగస్త్య కథానాయకుడిగా 'మేఘాలు చెప్పిన ప్రేమకథ' పేరుతో ఓ మ్యూజికల్ రొమాంటిక్ డ్రామా రూపొందుతున్నది. విపిన్ దర్శకత్వంలో ఉమాదేవి కోట నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. త్వరలో సినిమాను విడుదల చేయనున్నారు. ప్రమోషన్‌లో భాగంగా ఈ సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని గురువారం మేకర్స్ విడుదల చేశారు. నాయకానాయికలు నరేష్ అగస్త్య, రబియా ఖాతూన్ అందంగా నవ్వుతూ ఈ పోస్టర్‌లో కనిపిస్తున్నారు. ఇది రొమాంటిక్ మ్యూజికల్ ఎంటర్‌టైనర్ అని ఫస్ట్‌లుక్ పోస్టర్ చెప్పకనే చెబుతున్నది. పోస్టర్‌లోని పొగమంచు, ప్రశాంతమైన కొండప్రాంతం.. ఓ అందమైన గిటార్.. ఇవన్నీ ఇది సంగీత నేపథ్యంలో సాగే ప్రేమకథ అని చెబుతున్నాయి. సుమన్, ఆమని ముఖ్య పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రంలో రాధిక శరత్‌కుమార్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ చిత్రానికి కెమెరా: మోహన్‌కృష్ణ, సంగీతం: జస్టిస్ ప్రభాకరన్, ఆర్ట్: తోట తరణి, నిర్మాణం: సునేత్ర ఎంటర్‌టైన్మెంట్స్ ప్రై.లిమిటెడ్.





జనానందమే సదానందం అనే ట్యాగ్‌లైన్‌తో హాస్యప్రధాన సందేశాత్మక చిత్రాలను రూపొందిస్తూ ఆరోగ్యకరమైన కామెడీతో తెలుగు ప్రజలకు ఆనందాన్ని అందిస్తున్న హాస్య కిరిటీ ఆర్.ఎస్.నందాకు తెలుగు వెలుగు సాహితి వేదిక రాష్ట్రస్థాయి నంది పురస్కారంతో సత్కరించింది. తెలుగు సాహితి వేదిక జాతీయ స్థాయి స్వచ్ఛంద సంస్థ. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, ఒరిస్సా, మహారాష్ట్ర, పాండిచ్చేరిలో ఆయా రాష్ట్రాల సంప్రదాయాలను, సంస్కృతిని ప్రతిబింబించే కార్యక్రమాలను నిర్వహిస్తూ వివిధ రంగాల్లోని ప్రముఖులకు అవార్డులను ప్రదానం చేస్తున్నది.




